# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 26-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఈరోజు దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.
- ❖ దిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.
- ❖ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా భారత గణతంత్ర దినోత్సవ పరేడ్ నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ సమాజం కోసం ప్రజలు చేస్తున్న స్ఫూర్తిదాయకమైన పనులు, సేవలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం ద్వారా విస్తృతపరుస్తున్నారని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.

========================

గణతంత్ర దినోత్సవ వేడుకలను ఈరోజు దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. దిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన వేడుకలలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షులు ప్రబోవో సుబియాంటో హాజరయ్యారు. దేశ సాంస్కృతిక వారసత్వ వైభవాన్ని, సైనిక శక్తి సామర్థ్యాలను చాటేలా 76వ గణతంత్ర దినోత్సవాన్ని కేంద్రప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహించింది. 'స్వర్ణమయ భారత్ - వారసత్వం, వికాసం' అనే ఇతివృత్తంతో ఈసారి కవాతులో పాల్గొనే శకటాలకు రూపకల్పన చేశారు. బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీబ్యారెల్ రాకెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్తవ్య పథ్‌పై హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. రాష్ట్రపతి భవన్ నుంచి ఎర్రకోట వరకు 9 కిలోమీటర్ల మేర రిపబ్లిక్ డే పరేడ్ ఏర్పాటు చేశారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర శాఖలకు చెందిన 31 శకటాలను ప్రదర్శించారు. ఈ వేడుకల్లో త్రివిధ దళాలు సంయుక్తంగా ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు తదితరులు పాల్గొన్నారు.

========================

ఇండోనేషియా అధ్యక్షులు ప్రబోవో సుబియాంటో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరవ్వడం ఎంతో ఆనందంగా ఉందని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. ఈరోజు ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ... 1950లో జరిగిన ప్రారంభ వేడుకలకు అప్పటి ఇండోనేషియా అధ్యక్షులు సుకర్ణో ముఖ్య అతిథిగా పాల్గొన్నారని తెలిపారు. అప్పటి నుండి గణతంత్ర వేడుకలకు వివిధ దేశాల ముఖ్య అతిథులకు ఆతిథ్యం ఇచ్చే సంప్రదాయాన్ని భారత్ కొనసాగించిందని తెలిపారు. భారత్ పర్యటనలో భాగంగా ఇండోనేషియా, భారత్ దేశాల మధ్య నిన్న పలు ద్వైపాక్షిక ఒప్పందాలు జరిగాయని కేంద్ర మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

=======================

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోకసభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాస్వామ్యం, గౌరవంతో పాటు ఐక్యతగా దేశ అభివృద్ధి ప్రయాణం సాగేలా కృషి చేసిన మహనీయులందరికీ ఈ సందర్భంగా నివాళులర్పిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈ వేడుక రాజ్యాంగంలోని ఆదర్శాలను, విలువలను పరిరక్షించడంతో పాటు పటిష్టమైన, సుసంపన్నమైన భారతదేశాన్ని నిర్మించేందుకు చేస్తున్న కృషిని బలోపేతం చేస్తుందని సామాజిక మాధ్యమం వేదికగా ఆకాంక్షించారు.

75 సంవత్సరాల ఉజ్వల ప్రయాణంలో భారతదేశం మరింత బలపడిందని లోకసభ స్పీకర్ ఓం బిర్లా తన సందేశంలో పేర్కొన్నారు. దేశం వ్యవసాయం నుంచి క్రీడల వరకు, భూమి నుంచి అంతరిక్షం వరకు ఎన్నో విశేషమైన విజయాలు సాధించిందని అన్నారు.

భారత రాజ్యాంగ విలువలపై విశ్వాసం, సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్యంపై అంకితభావానికి గణతంత్ర దినోత్సవం చిహ్నం అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిర్మించడంలో మన వంతు సహకారాన్ని అందిద్దామని తన సందేశంలో పేర్కొన్నారు.

=======================

ఢిల్లీలోని కర్తవ్యపథ్ లో ఘనంగా జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రపంచ ప్రఖ్యాతమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏటికొప్పాక బొమ్మల శకటం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సహా ప్రముఖులందరిని ఆకట్టుకుంది. పర్యావరణహితమైన, సహజసిద్ధమైన వనరులతో చేసే ఏటికొప్పాక బొమ్మలు ఆంధ్రప్రదేశ్ కళాకారుల సృజనాత్మకతకు మారుపేరుగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కర్తవ్యపథ్ లో సాగిన శకటాల పరంపరలో 'బొమ్మలమ్మ... బొమ్మలు' అంటూ సాగే పాటతో ఏటికొప్పాక బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, దీనికి కారణభూతులైన వారందరిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని సామాజిక మాధ్యమం వేదికగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

విరామం

=======================

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగ భారత గణతంత్ర దినోత్సవ పరేడ్ నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ అద్భుతమైన కవాతు సాంస్కృతిక, వారసత్వం, సైనిక పరాక్రమాన్ని ప్రదర్శించిందని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. ఈ వేడుకలో ప్రదర్శించబడిన శకటాలు ఆయా రాష్ట్రాల గొప్ప సంప్రదాయాలను సూచించాయని ప్రధానమంత్రి అన్నారు.

=======================

భారతదేశ 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ దేశాల నేతలు సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. పరస్పర విశ్వాసం, గౌరవం కలిగిన  భారతదేశంతో తమ దేశ స్నేహం, సహకారం, బలమైన బంధాలను ఎల్లప్పుడూ కలిగి ఉంటుందని మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జూ అన్నారు.

భారతదేశపు ఐక్యత దృక్పథం, అద్భుతమైన విజయాలు ప్రపంచానికి స్ఫూర్తిని ఇస్తున్నాయని భూటాన్ ప్రధానమంత్రి షెరింగ్ టోబ్గే తన సందేశంలో పేర్కొన్నారు.

జాతీయ ఐక్యత, ప్రజాస్వామ్య ఆదర్శాలు ఇరు దేశాల మధ్య లోతైన స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

=======================

ప్రజలు చేస్తున్న స్ఫూర్తిదాయకమైన పనులను, సేవలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా విస్తృతపరుస్తున్నారని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. న్యూఢిల్లీలోని ఆకాశవాణి భవన్‌లో 76వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు హాజరయిన ప్రత్యేక అతిథులతో కేంద్రమంత్రి ఈరోజు సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన సంభాషిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

ఈ కార్యక్రమంలో ప్రసార భారతి చైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్, ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రజ్ఞ్యా పాలివాల్ గౌర్, దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ కంచన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

=======================

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ ను ఇటలీకి చెందిన ఆటగాడు జెన్నిక్ సిన్నరే దక్కించుకున్నాడు. ఈరోజు జరిగిన ఫైనల్‌లో  సిన్నర్ జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్ జ్వరేవ్ పై విజయం సాధించారు.

=======================

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహాకుంభ మేళ ఈరోజుతో 14వ రోజుకు చేరుకుంది. భక్తులు స్నానాలు, పూజలు ఆచరించి, మేళా ప్రాంతంలో ఏర్పాటు చేసిన అనేక ప్రదర్శనలను  సందర్శిస్తున్నారు. దీనిలో భాగంగా మేళలో ఏర్పాటుచేసిన  నరేంద్ర మోదీ యాప్ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇది వివిధ పథకాలు, కార్యక్రమాల గురించి సందర్శకులకు వివరిస్తుంది.

కాగా 73 దేశాలకు చెందిన దౌత్యవేత్తలు ప్రయాగ్‌రాజ్‌కు రానున్నారు. రష్యా, ఉక్రెయిన్, అమెరికా, జపాన్, జర్మనీ, నెదర్లాండ్, కెనడా, స్విట్జర్లాండ్, స్వీడన్, సహా వివిధ దేశాల దౌత్యవేత్తలు ఫిబ్రవరి 1న త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

=======================

మలేషియాలోని కౌలాలంపూర్ వేదికగా అండర్-19 మహిళల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భారత విజయాల పరంపర కొనసాగుతోంది.  ఈరోజు సూపర్ సిక్స్ గ్రూప్-1లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

=======================
=======================